

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

# శ్రీ సాయి లీలామృతము



## అధ్యాయము - 4

## భక్త సులభుడు

భక్తులకు ఇహపర శ్రేయస్సు చేకూర్చడానికే వచ్చానని బాబా చెప్పేవారు. ఐహికమైన కోర్కెలతో బాబాను దర్శించరాదని చెబుతున్న భక్తునితో, "అలా చెప్పవద్దు. నా వద్దకు అందరూ మొదట అలానే వస్తారు. కష్టాలు, కోరికలూ తీరి జీవితంలో స్థాయి చిక్కాక నన్ననుసరించి సన్మార్గానికి వస్తారు" అన్నారు. అందుకే సాయి భక్త సులభుడు. భక్తులకెట్టి కఠోర నియమాలూ పెట్టక దర్శన స్మరణలతో ప్రసన్నులవుతారు.

రేగే అను భక్తుడు హైకోర్టులో జడ్జిగా పనిచేశాడు. ఉపనయనమైనప్పటినుండి అతడు ఆసన, ప్రాణాయామా లతో పాటు సూర్యుని బింబము మధ్యలో శ్రీమన్నారాయణుడున్నట్లు ధ్యానిస్తూండేవాడు. అతనికి 1910లో ఒకే రాత్రి మూడు కలలు వచ్చాయి : 1) అతడు తన శరీరము నుండి విడివడి, ఎదుట శ్రీమన్నారాయణుని చూస్తున్నాడు. 2) ఈసారి శ్రీమన్నారాయణుడు తన ప్రక్కనున్న ఒక వ్యక్తిని చూపి, 'ఈ శిరిడీ సాయి నీవాడు; ఆయననాశ్రయించు' అన్నాడు. 3) అతడు గాలిలో తేలి ఒక గ్రామం చేరాడు. ఒక వ్యక్తి కన్పించి అది శిరిడీ అని చెప్పి, అతనినొక మశీదుకు తీసుకెళ్ళాడు. అక్కడ సాయి కాళ్ళు చాపుకొని కూర్చొని వున్నారు. అతడు నమస్కరించగానే లేచి, అతనిని కౌగిలించుకొని, 'నీవు నా దర్శనానికి వచ్చావా? నేనే నీకు ఋణపడ్డాను; నేనే నీ వద్దకు రావాలి' అని అతనికి నమస్కరించారు. తర్వాత కొంతకాలానికి అతడు శిరిడీ వెళ్ళి బాబాకు నమస్కరించగానే ఆయన, 'అరే! మనిషిని పూజించడమేమిటి?' అని అతని సంశయముపై దెబ్బతీసారు. స్వప్నంలోలాగ తనను దగ్గరకు తీయలేదని నిరాశ చెంది, మధ్యాహ్నం బాబా ఒక్కరే వున్నప్పుడు ఆయనను దర్శించాడు రేగే. ఆయన అతనిని కౌగిలించుకొని, "నీవు నా వాడివి. క్రొత్తవారి ఎదుట బిడ్డలను దగ్గరకు తీయము" అన్నారు. అతని కల నిజమైంది. ఇష్టదైవం అతనికి సద్గురువును చూపాడు! అతని ఆనందానికి అవధులు లేవు. అతడు 1915లో రామనవమికి ఒక మస్లిన్ గుడ్డ తీసుకొని శిరిడీ చేరాడు. సహజంగా బాబా భక్తులిచ్చే గుడ్డలు ప్రసాదంగా తిరిగి వారికే యిచ్చేసేవారు. కాని తానిచ్చే గుడ్డను వారే వుంచుకోవాలనుకొని రేగే దానిని రహస్యంగా వారి ఆసనం క్రింద పెట్టాడు. బాబా అందరిచ్చిన గుడ్డలు తిరిగి యిచ్చివేసి, లేచి నిలబడి, ఆసనం దులిపివేయమన్నారు. అపుడు కన్పించిన ఆ మస్లిన్‌ను తీసి కప్పుకొని, "ఇది నాది! నేను కప్పుకొంటే బాగుండలేదూ?" అని అతనికేసి చూచి నవ్వారు. అలాగే ఒక గురుపూర్ణిమనాడు భక్తులందరూ బాబాకు మాలలు వేస్తున్నారు. తానేమీ తీసుకురాలేదని రేగే నొచ్చుకుంటుంటే బాబా తన మెడలోని మాలలన్నీ అతనికి చూపి, "ఇవన్నీ నీవే!" అన్నారు.

ఒకనాటి మధ్యాహ్నం రేగేను మశీదుకు పిలిపించి, బాబా ప్రేమగా "నా ఖజానా తాళంచెవి నీ చేతిలో పెట్టాను, నీకేమి కావాలో కోరుకో, యిస్తాను!" అన్నారు. రేగే వివేకంతో, 'అన్ని జన్మలలోనూ మీరు నాకు తోడుండాలి!' అన్నాడు. ఆయన, "తప్పక వుంటాను" అని సంతోషంతో అతని వీపు తట్టారు. నాటినుండి అతనికెప్పుడూ బాబా తన దగ్గరున్నట్లే వుండేది. అతని బిడ్డ చనిపోయినప్పుడు రేగే ఎదుట సాయి ప్రత్యక్షమై, "నీకు నేను కావాలా, బిడ్డ కావాలా? బిడ్డ కావాలంటే బ్రతికిస్తానుగాని, మనకెట్టి సంబంధమూ వుండదు. నీకింకా బిడ్డలు కలుగుతారు" అన్నారు. "మాకు మీరే కావాలి?" అన్నాడు రేగే. "అయితే దుఃఖించకు!" అని బాబా అదృశ్యమయ్యారు.

బల్వంత్ నాచ్నే మొదటిసారి శిరిడీ వెళ్తుంటే దారిలో ఒక స్టేషన్ మాస్టర్ కలసి, సాయి వట్టి మోసగాడని చెప్పడంతో నాచ్నే మనస్సు కలతపడింది. అతడు శిరిడీ చేరేసరికి సాయి లెండీ నుండి వస్తూ అతనిని చూచి, "మమల్తదార్‌కు చెప్పకుండా వచ్చావేమి? ఇలా ఎప్పుడూ చేయకు!" అన్నారు. ఆ మాట నిజమే! నాచ్నే అక్కడున్న మూడు రోజులలో యిలాంటి లీలలెన్నో చూచాడు. అతనికి బాబాపై విశ్వాసం కలిగింది.

అతడు 1915లో శిరిడీ వెళ్తుంటే, సామంత్ అనే వ్యక్తి సాయికివ్వమని ఒక కొబ్బరికాయ, రెండు అణాలు యిచ్చాడు. నాచ్నే కొబ్బరికాయ సాయికి సమర్పించాడు గాని దక్షిణ యివ్వడం మరచాడు. అతడు తిరిగి వెళ్ళేటప్పుడు సాయి, "మంచిది. వెళ్ళిరా! కాని ఆ పేద బ్రాహ్మణుడు యిచ్చిన రెండణాలు యివ్వవేమి? ఒప్పుకున్న పని సరిగా చేయి, లేకుంటే ఒప్పుకోకు!" అన్నారు. అతడవి తెచ్చి సమర్పించాడు.

సాయిని చాలాకాలం సేవించిన శ్రీమతి చంద్రాబాయి బోర్కర్ యిలా చెప్పింది : "మావారు 1909లో పండరిలో వున్నారు. నేను శిరిడీ వెళ్ళాను. ఒకరోజు బాబా, 'అమ్మా, నీవు వెంటనే పండరి వెళ్ళు. నేను తోడుగా వుంటాను. నాకు రైలు అక్కరలేదు' అన్నారు. నేను మరిద్దరితో కలసి వెళ్ళేసరికి మావారు అక్కడ పని వదలి ఎక్కడికో వెళ్ళిపోయారు. నా వద్దనున్న పైకంతో తిరిగి కురుద్వాడీ చేరి, దిక్కుతోచక స్టేషన్‌లో కూర్చున్నాను. ఒక ఫకీరు వచ్చి, 'ఆలోచిస్తావేమి? వెంటనే వెళ్ళు, మీవారు ఢోండ్ స్టేషన్‌లో వున్నారు' అన్నాడు. నా దగ్గర చార్జీలు లేవంటే అతడు మూడు టిక్కెట్లు యిచ్చాడు. మేము ఢోండ్ చేరేసరికి, మావారక్కడ కునుకు తీస్తూంటే కలలో ఫకీరు కన్పించి, 'నా తల్లినిలా అశ్రద్ధ చేయకు, యిప్పుడు రైల్లో వస్తుంది' అన్నారట. మావారు ఎదురొచ్చి నన్ను తీసుకెళ్ళారు. నా దగ్గరున్న సాయి పటం చూచి తనకు కన్పించినది వారేనన్నారు.

నేను 48 సం॥ల వరకూ గర్భిణిని కానేలేదు. బాబా 1918లో ఒకసారి, 'తల్లీ, నీకేమి కావాలి?' అన్నారు. 'మీకు తెలుసు!' అన్నాను. ఆయన సరేనన్నారు. తర్వాత 3 సం॥లకు నాకు ఋతుక్రమం ఆగిపోయింది. ఆ వయస్సులో గర్భం అవదని, అది వ్రణమనీ వైద్యులన్నారుగాని నేను పది మాసాల వరకు శస్త్రచికిత్స చేయించు కోనన్నాను. చిత్రం! నాకు సకాలంలో సుఖప్రసవమైంది.

అలానే మరొకసారి కలలో బాబా, 'నీ రాముని తీసుకుపోతాను. నీవు ధైర్యంగా నీ విధి నిర్వర్తించు!' అన్నారు. బాబా చెప్పినట్లే చాతుర్మాస్యంలో మావారికి ప్రమాదంగా జబ్బు చేసింది. ఆయన కోరిక ప్రకారం చాతుర్మాస్యం వెళ్ళేదాకా మా వారిని నిలుపమని బాబాను కోరాను. చాతుర్మాస్యమైన ఏడవ రోజున మావారు టీ త్రాగి విష్ణు సహస్రనామము, ఆరతి చదివించుకొని విన్నారు. డాక్టర్లు ప్రమాదం తప్పిందన్నారుగాని, నాకు బాబా చెప్పింది గుర్తొచ్చి గంగ వేశాను. ఆయన, 'శ్రీరామ్' అంటూ కన్నుమూశారు". అంటే ఆమెపై ప్రేమతో ఆమె భర్తనుగూడ సాయి అనుగ్రహించారన్నమాట!

అన్వర్‌ఖాన్ ఖాజీ (అహ్మద్‌నగర్) సాయిని దర్శించి, తేలీకాకూట్ అనేచోట ఒక మశీదును పునరుద్ధరించడానికి ధనం కోరాడు. బాబా అతనితో, "ఆ మశీదు ఎవరినుండీ ధనం స్వీకరించదు. తానే యిస్తుంది. అక్కడ నింబారు క్రింద మూడడుగులు త్రవ్వితే నిధి లభిస్తుంది" అన్నారు. తర్వాత బాబా చెప్పినది అక్షరాలా నిజమైంది. మరొకసారి 'మీరాన్' (ఖాండేష్ జిల్లా) నుండి మద్దూషా ఫకీరొచ్చి అత్యవసరంగా రూ. 700/- లు కావాలని చెప్పి దుఃఖించాడు. ఆ పైకం బాపూసాహెబ్ జోగ్‌ను ఇవ్వమన్నారు సాయి. అతడాపైకం సాయికి యిచ్చాడు. దానిని ఆ ఫకీరుకివ్వమని గులాబ్, లక్ష్మణ్ అనే యువకులకిచ్చారు సాయి. వారు దానిలో రూ. 200/- లు తీసుకొని మిగిలినది మాత్రమే ఫకీరుకిచ్చారు. అతడెంత గోల పెట్టినా సాయి పలుకలేదు. అతడు కాలి నడకన వెళ్తుంటే నీమ్‌గాఁవ్ వద్ద అతనికి

"ఇర్రస్ షా అనే పార్శీభక్తుడెదురై భిక్ష, 200/-లు సమర్పించాడు. కారణం ఆ ముందటి రాత్రి ఇర్రస్‌షాకు సాయి కలలో కన్పించి టాంగాలో శిరిడీ వెళ్ళమని, నీమ్‌గాఁవ్ దగ్గర ఎదురయ్యే ఫకీరుకు భోజనము, రూ. 200/- లు యివ్వమనీ చెప్పారు.

మరొకసారి లాసూర్‌నుండి వచ్చిన ముస్లిం రూ. 4000/-లు కావాలని ఏడ్చాడు. తామిచ్చినా అతనికి దక్కదని సాయి ఎంత చెప్పినా అతడు వినలేదు. 'రేపు ఉదయం మఱ్ఱిచెట్టు దగ్గరకెళ్ళు, లంకెబిందె దొరుకుతుంది' అన్నారు బాబా. అతడు నమ్మలేదు గాని, ఆ చెట్టు దగ్గరకెళ్ళాడు. అక్కడొక లంకెబిందె కన్పించింది! దానిని మోయలేక మరొకరిని తోడు తీసుకు వెళ్ళేసరికి అదక్కడ లేదు. అతడేడుస్తూ వచ్చి బాబాతో చెప్పాడు. దానిని రూయీ గ్రామస్థుడొకడు తీసుకుపోయాడన్నారు సాయి.

శిరిడీ సమీపంలోని కోర్హైలానుండి రోజూ ఆరతి, భజనలకు పిలాజీ గురవ్ శిరిడీ వస్తుండేవాడు. అతని భార్యకొకరోజు సాయి కలలో కన్పించి, అర్ధరూపాయిచ్చి, "దీనిని డబ్బుల సంచీలో పెట్టుకో, లోటుండదు" అన్నారు. ఆమె తన బాబుకొకగుడ్డ యివ్వమన్నది. "తర్వాత యిస్తాలే!" అన్నారాయన. ఆ రాత్రే గురవ్‌కు గూడ కలలో కన్పించి, "శిరిడీలో స్థిరపడండి, మీకే లోటూ రాదు" అన్నారు. మరురోజే వాళ్ళు శిరిడీ వచ్చేసారు. పిలాజీ రోజూ బాబా వద్ద సన్నాయి వాయించేవాడు. సాయి సమాధి చెందినప్పుడు కప్పిన గుడ్డ వారి కుమారునికి లభించింది. బాబా అలా తమ మాట నిలుపుకొన్నారు.

ఆత్మారాముని భార్య తగువు పెట్టుకొని, చాలా సం॥లు పుట్టింట్లోనే వున్నది. అతడు 1913లో తన తమ్ముడు బి. వి. వైద్య చెబితే బాబాను దర్శించి ఊదీ, ప్రసాదము తన భార్యకు పంపాడు. చిత్రం! అవి చేరగానే ఆమె భర్త యింటికి వచ్చేసి, "ఇదే నా యిల్లు! పుట్టింట్లో సుఖమేమున్నది?" అన్నది. నాటినుండి వారు సుఖంగా వున్నారు.

హరిభావూ ఫన్సే ఒక కలరా రోగికి బాబా ఊదీ యిస్తే ఆ వ్యాధి తగ్గడంతో రోగులెందరో వచ్చి అతని వద్ద నున్న ఊదీ అంతా తీసుకుపోయారు. ఇంకేమి చేయాలా అని అతడు కంగారుపడుతుంటే, నాటితో ఊళ్ళోనే ఆ వ్యాధి లేకుండా పోయింది. తర్వాత ఫన్సే ప్రక్కగ్రామంలో ఒక మిత్రుని వద్దకు వెళ్ళాడు. ఆ మిత్రుని తమ్మునికి ఎంతో ప్రమాదంగా జబ్బుచేసి ఏమి చేసినా తగ్గడంలేదు. అతని స్నేహితుడు, "సాయి మహాత్ముడైతే నీద్వారా నా తమ్ముణ్ణి కాపాడాలి" అన్నాడు. రోగి పరిస్థితి ప్రమాదంగా వుండడం వలన ఫన్సే తప్పించుకోజూచాడు గాని వీలుపడలేదు. నాటిరాత్రి ఆ రోగియే శ్రీసాయి పూజకు అన్ని ఏర్పాట్లూ చేసి, పూజంతా శ్రద్ధగా చూస్తూ కూర్చున్నాడు. ఎలాగైనా తప్పించుకోవాలని ఫన్సే ఎంత ఎక్కువ ఫీజు అడిగినా వాళ్ళు అంగీకరించారు. నాటి రాత్రి కలలో సాయి కన్పించి ఫన్సేకు మందు తెలిపారు. దానితో ఆ వ్యాధి తగ్గిపోయింది.

బాబాను నమ్మినవారికి తప్పక న్యాయం చేకూరుతుంది. గుహడా అనే ఊళ్ళో ఒక బ్రాహ్మణునికి ఒక చిన్న నేరానికి మరణశిక్ష విధించారు. అతని మిత్రుడైన ముస్లిం శిరిడీ వెళ్ళి సాయికి చెప్పుకుంటే ఆయన, "భగవంతుడు నాల్గు రోజులలో కరుణిస్తారు" అన్నారు. అతడు అప్పీలు చేసుకుంటే, సరిగా నాలుగవ రోజుకల్లా శిక్ష రద్దయింది. అలానే ఒకప్పుడు బాంద్రాలోని కుదువ వ్యాపారులు కొందరు వ్యాపారంలో అక్రమాలు చేశారు. కాని వారితోపాటు ఆదందలాలికి గూడ నిష్కారణంగా శిక్ష పడేలా వున్నది. అతడు ఒక భక్తుని యింట బాబా పటానికి మొకరిల్లి, "నేను నిర్దోషిని, నన్ను రక్షించు" అని ప్రార్థించాడు. అందరిలో అతనికొక్కడికే శిక్ష తప్పి పరువు నిలచింది. అతడు సంతోషంగా టీ త్రాగడానికి వెళ్తుంటే కూడా ఒక ఫకీరు వచ్చారు. కాని హోటల్‌వద్ద ఆదమ్ వెనుకకు తిరిగి చూసేసరికి ఆ ఫకీరు కన్పించలేదు.

కాకాసాహెబ్ దీక్షిత్ 1910లో శిరిడీలోని కొంతభూమి బేరం చేసాడు. ఆసామి లక్ష్మణ్‌భట్ దాని వెల రూ. 200/- లు చెబితే, దీక్షిత్ రూ.150/-లకు అడిగాడు. బేరమెంతకూ తెగలేదు. భట్ మశీదుకు వెళ్ళినపుడు సాయి, 'ఎందుకలా వాదించుకుంటారు? మధ్యేమార్గంగా పోండి. నీవు రూ.175/-లకు తగ్గవద్దు'' అన్నారు. కాని అతడా విషయం దీక్షిత్‌కు చెప్పలేదు. చివరకు రూ. 150/-కి కొనుగోలు జరిగింది. కాని లక్ష్మణ్ యింటికి వచ్చి డబ్బు లెక్క పెట్టుకుంటే రూ. 175/-లు వున్నది.

తుర్భేగాఁవ్‌లో శాంతాబాయికి వేలుమీద ఎముక కుళ్ళి చీము కారుతుండేది. ఆమెకు ఒకరోజు కలలో బాబా కన్పించి, "దేకామాలి" ఆకు పసరు పూసుకోమన్నారు. అలాచేస్తే ఆ పుండు త్వరలో తగ్గిపోయింది. ఆ విషయం ఆమె సెప్టెంబరు 1918లో బాబాకు జాబు వ్రాసింది. ముల్కీ అనే గ్రామంలో వెంకట్రావు అనే భక్తుడు ఒకరోజు గుండెపోటు వచ్చి పడిపోయాడు. ఆ స్థితిలో అతనికి బాబా, ఇద్దరు సేవకులు దర్శనమిచ్చారు. అతడు వారిస్తున్నా వినకుండా ఆ సేవకులు అతని కాళ్ళు వత్తారు. తరువాత వెంకట్రావు 1918లో శిరిడీ వెళ్ళినపుడు సాయివద్ద ఆ సేవకులిద్దరినీ చూశాడు. అంతవరకు తన తండ్రియొక్క భక్తి విశ్వాసాలను విమర్శిస్తూ వున్న వెంకట్రావు ఆస్తికుడు, సాయి భక్తుడయ్యాడు. అతనికి ఏ కష్టమొచ్చినా సాయికి వ్రాస్తే ఆ జాబు బాబాకు చేరగానే కష్టం తొలిగేది.

★★★

**★ గురువారం పారాయణ సమాప్తము ★**

